ఇక అందుబాటులోకి ఇసుక

పార్వతీపురం, న్యూస్‌టుడే: నూతన విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్న నేపథ్యంలో భవన నిర్మాణదారులకు ఇసుకను అందుబాటులోకి తీసుకొచ్చి సరఫరా ప్రారంభించాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఇసుక కోసం నమోదు, సరఫరాపై బుధవారం గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.కె.మీనా దూరదృశ్య శ్రవణ సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా యంత్రాంగానికి కలెక్టరు పలు సూచనలు చేశారు. జిల్లాలో ఇసుక సరఫరాకు రెండు రోజుల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని, రవాణా వాహనాలకు జీపీఎస్ అమర్చాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ శోభిక, గనుల శాఖ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనుసంధాన రహదారులకు రూ.17 కోట్లు


కారాడవలసలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం నియోజకవర్గంలో తొలి విడతగా రూ.17 కోట్లతో అనుసంధాన రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే బి.విజయచంద్ర చెప్పారు. బుధవారం మండలంలోని నర్సిపురం పంచాయతీలో రూ.60 లక్షలతో నాలుగు రోడ్ల పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రహదారులను పట్టించుకోలేదని, కూటమి సర్కారు వాటికే తొలి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పీఆర్ డీఈ రత్నకుమార్, ఏఈ చంద్రమౌళి, సర్పంచి బంగారమ్మ, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటనాయుడు, మాజీ వైస్ ఎంపీపీ గౌరీరమణ పాల్గొన్నారు.

రాకపోకలు.. ఒకే ఒక్కరోజు..


కాజ్‌వే మీదుగా పారుతున్న నీరు

- మళ్లీ దెబ్బతిన్న కాజ్‌వే
- నిలిచిన వాహనాలు
- దారి మళ్లించిన పోలీసులు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: పారాది వద్ద వేగావతి నదిపై తాత్కాలికంగా నిర్మించిన కాజ్‌వే మీదుగా బుధవారం మళ్లీ నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీనిని రెండు రోజుల కిందటే మరమ్మతులు చేశారు. కొత్త వంతెన నిర్మించే వరకు ఈ బాధలు తప్పవని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు.

కాజ్‌వే నిర్మించడానికి రూ.94 లక్షలు ఖర్చయింది. కొత్త వంతెన నిర్మాణానికి ఏడాదిన్నర పడుతుందని సంబంధిత అధికారులే అంటున్నారు. అంత వరకు కాజ్‌వే ఉంటుందనే నమ్మకం లేకుండా పోయింది. ఇప్పటికే ఐదు సార్లు మరమ్మతులు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. తాజాగా ఒక్కరోజే వాహనాలు ప్రయాణించాయి.

రూ.30 కోట్ల రహదారులు గుల్ల

కాజ్‌వే పాడైపోవడంతో బొబ్బిలి నుంచి తెర్లాం వెళ్లే రహదారి, రామభద్రపురం నుంచి బాడంగి దారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వీటి విలువ దాదాపు రూ.30 కోట్లు వరకు ఉంటుందని ర.భ శాఖ అధికారులు అంచనా వేశారు. రూ.11 కోట్లు పెట్టి కొత్త వంతెన సకాలంలో నిర్మిస్తే ఇంత నష్టం జరిగి ఉండేది కాదని అంటున్నారు.

బొబ్బిలి-తెర్లాం మీదుగా..

ప్రస్తుతం విశాఖ వైపు వెళ్లే భారీ వాహనాలు బొబ్బిలి-తెర్లాం మీదుగా, విశాఖ నుంచి వచ్చే వాహనాలు రామభద్రపురం- బాడంగి మీదుగా మళ్లించారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సతీష్‌కుమార్ పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా మార్గాల్లో గోతులు ఏర్పడి వాహనాలు కూరుకుపోయి, బోల్తా పడ్డాయి. బుధవారం నుంచి వాహనాలు మళ్లించడంతో ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని వాహన చోదకులు భయపడుతున్నారు. కాజ్‌వేకు మళ్లీ మరమ్మతులు చేస్తామని ఏఈ రాజు తెలిపారు.


అలజంగి వద్ద పాడైన రహదారి

మింగేస్తున్నారా.. చూస్తుంటారంతే!

చనిపోయినా పింఛన్లు.. మొక్కలు నాటారంటారు గానీ.. కనిపించవు.. పనికి రాకున్నా.. అనర్హులైనా.. వచ్చినట్టే.. మస్తర్లు ఇలా ఒక్కటేమిటి.. ఉపాధి హామీ పథకం.. అవినీతి, అక్రమాల లీలలు ఎన్నో. ఎంత తిన్నా.. బయటకు రాదు.. వచ్చినా చర్యలు ఉండవు.. ఏకంగా క్షేత్ర స్థాయి సిబ్బంది రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. ఆ స్థాయిలో బొక్కేస్తున్నా మిన్నకుంటున్నారు.

- జిల్లాలో రూ.8.22 కోట్లు పక్కదారి
- రికవరీల ఊసే లేదు


కురుపాం: సామాజిక తనిఖీ కార్యక్రమంలో సిబ్బందిని నిలదీస్తున్న అధికారులు

న్యూస్‌టుడే, పార్వతీపురం

జిల్లాలోని 15 మండలాల్లో జరిగిన పనులపై పదిహేను విడతల్లో సామాజిక తనిఖీలు చేపట్టి రూ.కోట్లలో అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. వాటిని రికవరీ చేసేందుకు నోటీసులు ఇద్దామన్నా బాధ్యులెవరో..? ఎంత వసూలు చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

3865 ఫిర్యాదులు

ఉపాధి పనుల్లో అవినీతి జరుగుతోందని జిల్లాలోని అన్ని మండలాల నుంచి 3,865 ఫిర్యాదులు వచ్చాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏకంగా రూ.8,22,18,166 పక్కదారి పట్టగా జిల్లా కేంద్రానిదే అగ్రభాగం కావడం విశేషం. బాధ్యుల నుంచి రావాల్సిన మొత్తాలను తిరిగి చెల్లించాలని ఇటీవల నోటీసులు జారీ చేశారు.

నోటీసులు ఇస్తున్నాం: సామాజిక తనిఖీల్లో గుర్తించిన తప్పిదాలపై సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇచ్చి వివరణ తీసుకుంటున్నాం. పనులు చేయకుండా చేసినట్లు నమోదు చేసుంటే పూర్తి చేయిస్తాం. జిల్లాలో రూ.8.22 కోట్లు రికవరీ చేయాల్సి ఉంది.
- కె.రామచంద్రరావు, పీడీ, జిల్లా జల యాజమాన్య సంస్థ


కొన్నింటిని పరిశీలిస్తే..

◆ కురుపాం మండలం నీలకంఠాపురం పంచాయతీలో 39 మంది మృతి చెందినప్పటికీ కొన్ని నెలలుగా పింఛన్లు ఇస్తున్నట్లు గుర్తించారు. ఇక్కడ రూ.6.93 లక్షలు, మిగిలిన పంచాయతీల్లో 16 మంది మృతుల పేరున రూ.4.52 లక్షలు ఇచ్చారు.

◆ వీరఘట్టం మండలం దశమంతపురంలో సచివాలయ భవనానికి కిటికీలు, తలుపులు వేయడానికి ఖాతా నుంచి నిధులు తీసుకున్నారు. కానీ అమర్చలేదని తనిఖీల్లో బయటపడింది. తర్వాత ఈ పనులు పూర్తి చేశారు.

◆ అన్ని మండలాల్లో వేతనదారుల నుంచి క్షేత్ర సహాయకులు రూ.100 చొప్పున వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి.

◆ చాలా మంది గ్రామాలను వదిలి వెళ్లినప్పటికీ పనులకు వచ్చినట్లు మస్తర్లు వేసి డబ్బులు పక్కదారి పట్టించారు. భారీగా మొక్కలు నాటగా 50 శాతం కూడా బతకలేదు.





విజయవాడ వరద బాధితుల కోసం పాచిపెంట మండలం పాంచాలి జడ్పీ ఉన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థులు సేకరించిన రూ.7 వేలు ఈ నెల 23న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సంధ్యారాణికి అందజేశారు. ఆ మొత్తాన్ని బుధవారం ముఖ్యమంత్రికి అందజేయగా ఆయన విద్యార్థులను అభినందించారు. - న్యూస్‌టుడే, పాచిపెంట


చిత్రపటం చూస్తున్న ఉప కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సరిహద్దు వివాదంపై నివేదిక ఇస్తాం

భామిని, న్యూస్‌టుడే: ఆంధ్రా, ఒడిశా భూ సరిహద్దు వివాదంపై పూర్తి స్థాయిలో నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు అందజేస్తామని పాలకొండ ఉప కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే వంశధార నదీ జలాల వివాదం సుప్రీంకోర్టులో ఉంది. గతంలో దిమ్మిడిజోల సమీపంలో ఏర్పాటు చేసిన ఇసుక ర్యాంపు వల్ల వచ్చిన ఫిర్యాదు మేరకు తవ్వకాలు నిలిపివేశారు. 1984లో ఉభయ రాష్ట్రాలు సంయుక్తంగా భూసర్వే చేసిన మ్యాప్‌ను ఉప కలెక్టర్ పరిశీలించారు. సబ్ డివిజన్లు ఏర్పాటుచేస్తే ఆంధ్రా భూభాగం ఎక్కడి వరకు ఉందో తెలుస్తుందన్నారు. మైనింగ్ ఏడీ శ్రీనివాసరావు, అధికారులు రాజ్‌కుమార్, కుమారస్వామి డివిజనల్ సర్వేయర్ వెంకటరావు, తహసీల్దార్ శేఖర్ ఉన్నారు.


సూచనలు చేస్తున్న పాలనాధికారి శ్యామ్‌ప్రసాద్

ఫీడర్ అంబులెన్స్ వెళ్లని గ్రామాలెన్ని?

పార్వతీపురం, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతంలో రోగులను తరలించేందుకు రహదారి సౌకర్యం లేని గ్రామాలకు ఫీడరు అంబులెన్సు పంపిస్తున్నామని, అవి కూడా వెళ్లలేని ప్రాంతాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని జిల్లా పాలనాధికారి శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. బుధవారం జిల్లాలోని వైద్య, ఆరోగ్య శాఖ, ఆసుపత్రుల్లో సేవలపై సమీక్షించారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య, ప్రమాదకరమైన పరిస్థితుల్లో పిల్లలు కన్నవారి వివరాలను సమగ్రంగా సమర్పించాలని ఆదేశించారు. ప్రసూతి మరణాల విషయంలో బాధ్యులైన సిబ్బంది, అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైరిస్కు గర్భిణులున్న చోట మరిన్ని జాగ్రత్తలు తీసుకొని, సుఖప్రసవం అయ్యేలా చూడాలని సూచించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య సేవల పరిశీలనకు జిల్లాస్థాయిలో కమిటీ ఏర్పాటుకు ఆదేశించారు. చాలా ఆసుపత్రుల్లో మత్తు వైద్యనిపుణులు లేకుండానే శస్త్రచికిత్సలు జరుగుతున్నాయనే విమర్శలున్నాయని, పరిశీలించాలని ఆదేశించారు. రక్తహీనత విషయంలో మహిళలను చైతన్యపరచాలని సూచించారు. మూత్రపిండాలు, నేత్ర, హృద్రోగ, నరాల వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. మలేరియా, డెంగీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి.. అవసరమైతే దోమల నియంత్రణకు డ్రోన్లతో ద్రావణం పిచికారీకి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎవరి కోసం ఈ గోదాములు!

వైకాపా అయిదేళ్ల పాలనలో తమ వారికి లాభం కలుగుతుందంటే చాలు పచ్చజెండా ఊపింది. ఇందుకు ఉమ్మడి విజయనగరం జిల్లాలో మంజూరు చేసిన బహుళ ప్రయోజన సౌకర్య (ఎంపీఎఫ్‌సీ) గిడ్డంగులే అద్దం పడుతున్నాయి.


భామిని మండలం లివిరిలో పూర్తయిన నిర్మాణం

ఈనాడు, పార్వతీపురం మన్యం: రైతులు తమ ఆహారోత్పత్తులను నిల్వ చేసుకుని, వాటికి మద్దతు ధర లభించినప్పుడు విక్రయించుకునేందుకు కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా విజయనగరం జిల్లాలో 44 గోదాములు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ఆరు రద్దయ్యాయి. మిగిలిన 38లో 500 టన్నుల సరకు నిల్వ సామర్థ్యం ఉన్నవి 35, వెయ్యి టన్నుల సామర్థ్యం ఉన్నవి 3 ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో 20 మంజూరయ్యాయి. 500 టన్నుల సామర్థ్యం ఉన్న ఒక్కొక్క దానికి రూ.40 లక్షలు, 1000 టన్నుల సరకుల నిల్వ సామర్థ్యం ఉన్న ఒక్కొక్క గోదాము రూ.75 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టారు. వీటి నిర్మాణానికి నాబార్డు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా రుణం మంజూరు చేసింది. పూర్తయిన తర్వాత సొసైటీల నుంచి ప్రతి నెలా వాయిదాల కింద రూ.60 వేలు డీసీసీబీ వసూలు చేసి నాబార్డుకు చెల్లించాలి. గోదాములు వినియోగంలోకి రాక, వాటిపై ఆదాయం లేక సొసైటీలు రుణ వాయిదాలు చెల్లించలేకపోతున్నాయి. వీటికి ప్రభుత్వం హామీ ఇచ్చినా ప్రస్తుతం రుణ వాయిదాలు వసూలు కావడం లేదు.

ఊరికి దూరం.. ఆపై నాణ్యత లోపం

గోదాములను ఊరికి దూరంగా నిర్మించారు. ఆపై లోతట్టు ప్రాంతాలు ఎంపిక చేశారు. ఈ పనులు దక్కించుకున్న గుత్తేదారులు నాణ్యతకు పాతరేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పైగా పర్యవేక్షణ కొరవడింది. మంజూరైన వాటిలో విజయనగరం జిల్లాలో 23, మన్యం జిల్లాలో ఆరు పూర్తి చేశారు. వీటిని సొసైటీలకు అప్పగించారు. విజయనగరం జిల్లాలో వెయ్యి టన్నుల సామర్థ్యంతో వేపాడ, తమ్మాపురం, గుషినిలో గోదాములు నిర్మాణంలో ఉన్నాయి.

కలెక్టర్ ఆదేశించినా..

గోదాముల ప్రగతిపై విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జులై 26న సమీక్షించారు. నిర్మాణం పూర్తయిన వాటిని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ ప్రక్రియను రెండు వారాల్లో పూర్తి చేయాలని అప్పటి జేసీ కార్తీక్‌ను ఆదేశించారు. ఇంతలో ఆయన బదిలీ అయ్యారు. నిర్మాణంలో ఉన్న వాటిని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పెండింగ్ బిల్లుల మంజూరుకు ఆమోదం తెలిపారు. ఇప్పటి వరకు గోదాముల వినియోగానికి సంబంధించి ఎటువంటి పురోగతి లేదు. ప్రభుత్వం హామీ ఇచ్చినా రుణ వాయిదాలు వసూలు చేసి నాబార్డుకు చెల్లించాల్సి ఉన్నందున సంబంధిత అధికారులు సొసైటీల చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదు. రుణాల వసూళ్లకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారని డీసీసీబీ సీఈవో ఉమామహేశ్వరరావు 'ఈనాడు'కు తెలిపారు. గోదాముల నిర్మాణ పనులు మార్కెటింగ్ శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. విజయనగరం జిల్లాలో 15 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని, ఒకటి న్యాయస్థానంలో కేసు కారణంగా ఆగిపోయిందని జిల్లా మార్కెటింగ్ శాఖ డీఈ రవికిరణ్ తెలిపారు. మన్యం జిల్లాలో ఆరు నిర్మాణాలు పూర్తయ్యాయి. తొమ్మిది చివరి దశ బిల్లుల చెల్లింపునకు ఎదురుచూస్తున్నాయి. అయిదు బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయి. పూర్తయిన ఆరు సొసైటీలకు అప్పగించామని శ్రీకాకుళం జిల్లా మార్కెటింగ్ శాఖ డీఈ కోటయ్య 'ఈనాడు'కు వివరించారు.

తోటపల్లి.. ఆహ్లాదం మళ్లీ

పార్వతీపురం, న్యూస్‌టుడే: తోటపల్లి జలాశయానికి ఆనుకుని ఏర్పాటు చేసిన ఐటీడీఏ పార్కుకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఒకప్పుడు ఎంతో ఆహ్లాదం పంచిన ఈ ప్రాంతాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో బోసిపోతోంది.


ఐటీడీఏ పార్కును పరిశీలిస్తున్న పీవో అశుతోష్ శ్రీవాత్సవ్

ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ్ పార్కును బుధవారం పరిశీలించారు. పాడైన క్రీడా సామగ్రిని బాగు చేయించి, తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. మరమ్మతులకు రూ.లక్ష వరకు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. కొత్తగా మరికొన్ని క్రీడా సామగ్రిని ఏర్పాటు చేసే దిశగా కసరత్తు చేస్తున్నారు. రూ.25 లక్షల విలువైన సామగ్రిని సామాజిక బాధ్యతగా కార్పొరేట్ సంస్థల ద్వారా సమకూర్చేలా యోచిస్తున్నారు. కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ అనుమతితో క్లైంబింగ్ బాల్స్, వాటర్ పోల్స్, పెడల్ బోటు, వాటర్ రోలర్స్ వంటివి ఏర్పాటు చేసేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నారు.

నిరుపయోగ నిర్మాణాలపై దృష్టి

పార్కును అనుసరించి ఐటీడీఏ చేపట్టిన మూడు భవనాలు ప్రస్తుతం నిరుపయోగంగా ఉండిపోయాయి. వీటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ఐటీడీఏ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఒక భవనంలో గిరిజన సాంస్కృతిక ప్రదర్శనశాలను ఏర్పాటు చేసి సందర్శకులను ఆకర్షించేలా చర్యలు తీసుకోనున్నారు. మిగిలిన రెండు భవనాల్లో ఒకటి వెలుగు మహిళలకు, మరొకటి గిరిజన సహకార సంస్థకు కేటాయించి, సరకుల ప్రదర్శన, విక్రయశాలలు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు.

కాటేజీల నిర్మాణం

తోటపల్లి కాలువకు రెండో వైపు ఖాళీగా ఉన్న ప్రాంతంలో ఫర్నిచర్‌తో కూడిన మూడు కలప కాటేజీలను నెలకొల్పి.. సందర్శకులు బస చేసేలా ఏర్పాట్లు చేయనున్నారు. దీని కోసం రూ.25 లక్షలు వెచ్చించేలా ప్రణాళిక చేస్తున్నారు. జలాశయంలో జల విహారానికి ఉన్న వనరులు, వసతులపై కూడా ఆరా తీసి మరింత విస్తృతంగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు.

27న ఆడలి వ్యూ పాయింట్ ప్రారంభం

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం అట్టహాసంగా నిర్వహిస్తామని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు ఆడలి వ్యూ పాయింట్, రెస్టారెంట్, నైట్ క్యాంపింగ్ టెంట్లు ప్రారంభిస్తామన్నారు. సాయంత్రం 4 గంటలకు ఎన్టీఆర్ ఉద్యానవనంలో 'ఐ లవ్' సీతంపేట పేరుతో ఫొటో పాయింట్, 5 డీ థియేటర్ ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమానికి మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే జయకృష్ణ, ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని పీవో తెలిపారు. సీతంపేట పార్కు అభివృద్ధికి రూ.1.50 కోట్లు ముఖ్యమంత్రి మంజూరు చేశారని, దీంతో మరిన్ని పర్యాటక పనులు చేపట్టడానికి వీలు కలుగుతుందన్నారు. అనంతరం వ్యూ పాయింట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏపీవో .జి.చినబాబు, డీపీవో వై.సతీష్ కుమార్ పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పీవో

రూ.కోటి సిమెంటు పక్కదారి

సర్వసభ్య సమావేశంలో సభ్యుల గగ్గోలు



వివరాలు తెలుసుకుంటున్న జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు

వేపాడ, న్యూస్‌టుడే: వేపాడ మండలంలో గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సంబంధించి రూ.కోటి విలువైన సిమెంటు పక్కదారి పట్టినట్లు బుధవారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో సభ్యులంతా గగ్గోలు పెట్టారు. సరఫరా చేయకుండానే బిల్లుల్లో కోత విధించారంటూ దబ్బిరాజుపేట, ముకుందపురం, బానాది తదితర పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరైన జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు స్పందించి.. జిల్లా అధికారులతో చరవాణిలో మాట్లాడారు. సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సేవా కేంద్రాల్లో సరఫరా చేసిన వరి విత్తనాల్లో కేళీలు వచ్చాయని సోంపురం ఎంపీటీసీ సభ్యుడు సత్యన్నారాయణ అన్నారు. ఎరువుల సరఫరా సకాలంలో జరగడంలేదని, ప్రైవేటు వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నా చర్యలు లేవంటూ జడ్పీటీసీ సభ్యుడు అప్పలనాయుడు ఆరోపించారు.

కళా ప్రదర్శనలకు ఆహ్వానం

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా నగరంలోని ఆనంద గజపతి కళాక్షేత్రంలో అక్టోబరు 13, 14వ తేదీల్లో నిర్వహించనున్న కళా ప్రదర్శనల్లో పాల్గొనాలనుకునేవారు ఈనెల 28 లోగా మహారాజా సంగీత నృత్య కళాశాలలో వివరాలు అందజేయాలని వేదిక ఇన్‌ఛార్జి ఎస్.ఉమాశంకర్ తెలిపారు. గడువు ముగిసిన తరువాత దరఖాస్తులు స్వీకరించమన్నారు. క్లాసికల్, సెమీ క్లాసికల్, భక్తి సంగీతం తదితర బృంద నృత్యాలకు మాత్రమే అవకాశం ఉందని, ఒక్కో ప్రదర్శనకు 15 నిమిషాలు కేటాయిస్తామన్నారు.

మహాసభల విజయవంతానికి పిలుపు



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలోని ఫూల్‌బాగ్ జగన్నాథ కల్యాణ మండలంలో అక్టోబరు 6, 7, 8వ తేదీల్లో జరగనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు పిలుపునిచ్చారు. సంఘం కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, విద్యావంతులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. విద్యా ప్రగతి, ఉపాధ్యాయుల సంక్షేమం, సమాజశ్రేయస్సు, మహిళాసాధికారత, నూతన విద్యా విధానంపై చర్చించి తీర్మానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిస్తామన్నారు. అనంతరం సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు, ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.బలరామ్‌నాయుడు, ఎన్.వి.పైడిరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెస్తాం



విద్యాసాగర్‌ను సత్కరిస్తున్న నాయకులు

మయూరి కూడలి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు ఎం.విద్యాసాగర్ అన్నారు. బుధవారం విజయనగరంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గ్రామ, మండల, జిల్లాస్థాయిలో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలకు ముందుంటామన్నారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు రమేష్ కుమార్, సతీష్ కుమార్, తిరుపతి, ఎ.కరీమ్, శ్రీనివాసరావు తదితరులు ఆయనను సత్కరించారు.

చికెన్ ధరలు

రకం	బ్యాగ్‌లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	118	206	216

ఆ అయిదింట్లో.. నగదు రహితం



- జనవరి నుంచి ప్రయోగాత్మకంగా అమల్లోకి
- దశలవారీగా మిగిలిన గ్రామాల్లో విస్తరణ

న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

ఏదైనా ఒక కార్యక్రమం అమలు చేసే ముందు పక్కా ప్రణాళిక ఉండాలి. ఇదేదీ లేకుండా ఉపక్రమిస్తే ఆచరణలో విఫలమయ్యే అవకాశం ఎక్కువ. గత ప్రభుత్వం పంచాయతీల్లో అమలు చేసిన నగదు రహిత లావాదేవీలే ఇందుకు నిదర్శనం. పంచాయతీలు బ్యాంకు ఖాతాలు ప్రారంభించినా, లావాదేవీలకు అవసరమైన క్యూఆర్ కోడ్.. ఈ-పోస్ యంత్రాలు అందుబాటులోకి వచ్చే సరికి జాప్యం చోటుచేసుకుంది. సాంకేతిక సమస్యలు వెంటాడడంతో అమలు పడకేసింది. దీనిని దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం దశలవారీగా చేపట్టాలని నిర్ణయించింది.

ఎంపికైనవి ఇవే..

మండలం	పంచాయతీ
బొబ్బిలి	పిరిడి
గంట్యాడ	కొర్లాం
చీపురుపల్లి	నిమ్మలవలస
పార్వతీపురం	పులిగుమ్మి
కురుపాం	గుమ్మ

తొలుత ఇలా..

2025 జనవరి నుంచి నగదు రహిత లావాదేవీలను నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది. పన్నులు, పన్నేతర ఆదాయం పక్కదారి పట్టకుండా ఉండాలన్నది ఈ విధానం ప్రధాన ఉద్దేశం. ఉమ్మడి జిల్లాలో 1228 పంచాయతీలుండగా.. 5 చోట్ల ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్నారు. డెబిట్, క్రెడిట్ కార్డు లేదా క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకోనున్నారు. గ్రామాలకు సంబంధించిన పన్ను, పన్నేతర ఆదాయం వివరాలు త్వరలో పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ద్వారా ఆధారంగా తెలుసుకుని నగదు కట్టాలి. గిరిజన ప్రాంతాల్లో సాంకేతిక సమస్యలున్న చోట కొన్నేళ్ల పాటు నగదు వసూళ్లనే కొనసాగించే అవకాశముందని పేర్కొంటున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో విజయనగరం జిల్లాకు పన్ను, పన్నేతర ఆదాయం కలిపి రూ.23.47 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా విధించారు.

గత ప్రభుత్వంలో..

కేంద్రం ఆదేశాలతో గత ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇంటిపన్ను, సర్‌ఛార్జీలు, రోజు వారీ మార్కెట్ వసూళ్లు ఇలా.. పంచాయతీకి డబ్బు చెల్లించాలంటే నగదు రహిత విధానంలోనే కట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఆన్‌లైన్ విధానంలో నగదు చెల్లింపులు, నెట్ బ్యాంకింగ్ విధానం, కార్యాలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పీవోఎస్ యంత్రాల్లో డెబిట్ కార్డులు, ఫోన్‌పే, పేటీఎం, చరవాణిలో క్యూఆర్ కోడ్ స్కాన్ వంటి విధానాల్లో చెల్లింపులు చేయాలి. పంచాయతీలు బ్యాంకు ఖాతాలు ప్రారంభించినా.. లావాదేవీలకు అవసరమైన బ్యాంకు క్యూఆర్ కోడ్.. ఈ-పోస్ యంత్రాలు అందుబాటులోకి వచ్చేసరికి ఆలస్యమైంది. ఈక్రమంలో సిబ్బంది కొందరి నుంచి నగదు, ఇంకొందరి నుంచి ఆన్‌లైన్ విధానంలో వసూలు చేపట్టారు. ఆన్‌లైన్‌లో జమైన సొమ్ము పంచాయతీ ఖాతాలకు రాకపోవడం, సర్వీసు ఛార్జీల్లో కోతపడడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇక నుంచి ఆ పరిస్థితి లేకుండా చూడనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారులు తెలిపారు.


బొజ్జగణపయ్యా వెళ్లిరావయ్యా

మండపాల్లో మూడు వారాల పాటు కొలువుదీరిన గణనాథుడు బుధవారం గంగమ్మ తల్లి ఒడిలో చేరాడు. విజయనగరం జిల్లా కేంద్రంలో అనుపోత్సవాలు సందడిగా జరిగాయి. పెద్దఎత్తున భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. యువత నృత్యాలతో సందడి చేసింది. స్థానిక రంగాలవీధిలో నిర్వహించిన ఊరేగింపులో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

\- న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం



ఊరేగింపులో వినాయక విగ్రహం



వేదికపై కళాకారుల విన్యాసాలు



వేషధారణలో భక్తుడు

ఎన్ఎంఎంఎస్‌కు గడువు పొడిగింపు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఎన్ఎంఎంఎస్ (జాతీయ ప్రతిభ ఉపకార వేతన పరీక్ష)కు దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబరు 3 వరకు గడువు పెంచినట్లు డీఈవో ప్రేమకుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు చూడాలని పేర్కొన్నారు.

విషాదం మిగిల్చిన విహారం

స్నేహితుల కళ్లెదుటే గల్లంతై యువకుడి మృతి



పవన్ (పాతచిత్రం)

గంట్యాడ, గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు వారివి.. ఒక్కరోజు పని మానేస్తే పూట గడవని పరిస్థితి.. ఎన్ని అడ్డంకులున్నా కుమారుడ్ని మాత్రం చదివించి ప్రయోజకుడిని చేయాలని ఆశపడ్డారు.. చివరికి చెట్టంత కొడుకును గెడ్డ మింగేయడంతో కన్నీరుమున్నీరయ్యారు. మిత్రులతో కలిసి సరదాగా వాగులోకి దిగిన యువకుడు గల్లంతై ప్రాణాలు కోల్పోయిన ఘటన గంట్యాడ మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయికృష్ణ వివరాల మేరకు.. గంట్యాడ గ్రామానికి చెందిన ఆర్.పవన్(17) స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తల్లిదండ్రులు పళ్ల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. బుధవారం పవన్ తన ముగ్గురు స్నేహితులతో కలిసి బుడతనాపల్లికి వెళ్లాడు. అక్కడ వీరికి మరో ముగ్గురు తోడయ్యారు. అంతా కలిసి గ్రామంలోని తమురు గెడ్డ వద్దకు వెళ్లి, సరదాగా నీటిలో కేరింతలు కొడుతుండగా పవన్ నాచులో జారిపోవడంతో మునిగిపోయాడు. మిగిలిన వారు కేకలు వేయడంతో స్థానికులు చేరుకుని వెతికారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్సై సాయికృష్ణ గజ ఈతగాళ్లతో గాలించగా సాయంత్రం మృతదేహం లభ్యమైంది. విద్యార్థి తండ్రి అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



అవతారం (పాతచిత్రం)

గంట్యాడ, గ్రామీణం, న్యూస్‌టుడే: చదువు ఉద్యోగం ఇవ్వలేదు.. సొంత కాళ్లపై బతకాలని చేసిన ప్రయత్నం ఫలించలేదు. . తీసుకున్న అప్పులు తిరిగి ఎలా చెల్లించాలో తెలియక మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గంట్యాడ మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయికృష్ణ వివరాల మేరకు.. పెదవేమలికి చెందిన వి.అవతారం(27) డిగ్రీ పూర్తి చేసి, ఉద్యోగం కోసం ప్రయత్నించినా ఫలించలేదు. అయినా నిరాశ చెందకుండా కొన్నేళ్ల క్రితం విజయనగరంలో సొంతంగా క్యాటరింగ్ వ్యాపారం ప్రారంభించి, నలుగురికి ఉపాధి కల్పించాడు. ఆపై అప్పులు చేసి, వ్యాపారాన్ని పెంచాడు. నష్టం రావడం, అప్పులు తీసుకున్న వారి ఒత్తిడి చేయడంతో మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం లక్కిడాం గ్రామానికి వెళ్లి స్నేహితుడి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పంకాకు ఉరేసుకున్నాడు. ఆయనకు తల్లిదండ్రులు, సోదరుడు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బొగ్గులో కూరుకుపోయి మతిస్థిమితం లేని వ్యక్తి మృత్యువాత

కొత్తవలస, న్యూస్‌టుడే: కంటకాపల్లిలోని ఓ పరిశ్రమ బొగ్గుయార్డులో మృతదేహంగా మారిన వ్యక్తి ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. ఈ కేసు వివరాలను సీఐ షణ్ముఖరావు బుధవారం వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం బలి చంద్రపూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని సొడియా గ్రామానికి చెందిన సంబునాథ్ పరిడియా(40) ఈనెల 22న యార్డులో ఉన్న బొగ్గులో కూరుకుపోయి కనిపించాడు. అప్పటికే మృతిచెందడంతో పరిశ్రమ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. కటక్ నుంచి ఆరు లారీల్లో పరిశ్రమకు బొగ్గు వచ్చినట్లు తేలడంతో.. అక్కడి యార్డు వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. సంబునాథ్ ఓ లారీలోకి సంచి పట్టుకొని ఎక్కి కూర్చొని, చెయ్యి ఊపుతూ, నమస్కరించిన దృశ్యాలు కనిపించాయి. మతిస్థిమితం లేక ఎక్కాడని, గమనించకుండా బొగ్గు లోడింగ్ చేయడంతో మరణించి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహం వద్ద బాధచ్చానా సీహెచ్‌సీ ఓపీ చీటీ లభ్యమవడంతో.. బంధువులకు సమాచారం ఇచ్చారు. అతడి తల్లి రుక్మిణి, సోదరి రుస్మిత, బంధువు సురేంద్ర రికార్డయిన దృశ్యాలను చూసి. . సంబునాథ్‌గా నిర్ధారించారు. ఎస్.కోట ప్రాంతీయాసుపత్రికి వచ్చి మృతదేహాన్ని గుర్తు పట్టారని సీఐ వివరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని మినీ వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై అనీష్ వివరాల ప్రకారం.. పెదకుదమకు చెందిన కె.కృష్ణ(50) వ్యవసాయ కూలీ. బుధవారం ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా.. జోగులడుమ్మ నుంచి బొమ్మిక వైపు వెళ్తున్న మినీ వ్యాన్ ఢీకొట్టింది. ఆయన బలంగా కిందడడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందారు. కృష్ణకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఇద్దరికీ వివాహాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోక్సో కేసు నమోదు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణమూర్తి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన జి.హేమంత్ ఓ బాలికను ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. తీరా పెళ్లి చేసుకోమని అడగ్గా.. అతనితో పాటు కుటుంబ సభ్యులు కులం పేరుతో దూషించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సోతో పాటు అట్రాసిటీ కేసులు నమోదు చేశామని సీఐ చెప్పారు.

రెండో భార్యను కలవొద్దన్నందుకు చంపేశాడు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు మండలంలో ఇటీవల జరిగిన మహిళ అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. కట్టుకున్న భర్తే కడతేర్చాడని నిర్ధారించారు. సీఐ రామకృష్ణ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కురాసువలసలో నివాసముంటున్న బి.శ్రీను 15 ఏళ్ల కిందట కరాసమ్మ(39)ను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. మరోవైపు 12 ఏళ్ల క్రితం కొత్తవలస గ్రామానికి చెందిన మరో యువతిని రాము పెళ్లి చేసుకున్నాడు. ఈమె కొన్నిరోజుల క్రితం కరాసువలసలోని ఓ ఇంట్లో దిగారు. తరచూ అక్కడికి వెళ్తున్నాడని, రెండో భార్యను కలవొద్దంటూ కరాసమ్మ భర్తతో గొడవపడింది. ఈక్రమంలో ఈనెల 20న ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రీను ఆమె మెడకు చున్నీ కట్టి గొంతు నులిమి చంపేశాడు. కొంతసేపటి తరువాత స్థానికులు వెళ్లి చూడగా.. విగతజీవిగా కనిపించింది. వెంటనే సాలూరు సామాజిక ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు అనుమానాస్పదమృతిగా కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడు లొంగిపోయి, నేరాన్ని ఒప్పుకొన్నాడని, కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం

తెర్లాం, న్యూస్‌టుడే: విద్యుత్తు తీగలు తగిలి రైతు మృతిచెందిన ఘటన తెర్లాం మండలంలో చోటుచేసుకుంది. అంట్లవారకు చెందిన కె.రామారావు(48) బుధవారం సాయంత్రం పొలం వైపు వెళ్లాడు. పంపుసెట్లకు సంబంధించిన తీగ తెగిపడిన విషయాన్ని గమనించకుండా నడవడంతో విద్యుదాఘాతానికి గురై మరణించాడు. ఆయనకు భార్య చిన్నమ్మి, ముగ్గురు కుమారులున్నారు. ఇంటి పెద్దను కోల్పోవడంతో ఇక తమకు దిక్కెవరని భార్య రోదిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. సమాచారం తెలుసుకున్న ఏఈ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సర్వీసు వైరు తెగి పడి ఉందని ఏఈ చెప్పారు. వివరాలు సేకరిస్తున్నామని ఎస్సై సాగర్‌బాబు తెలిపారు.

జిల్లా జట్ల ఎంపికలకు షెడ్యూల్ విడుదల

విజయనగరం క్రీడలు, కొత్తవలస: స్కూల్‌గేమ్స్ అండర్- 14, 17 ఉమ్మడి జిల్లాల జట్ల ఎంపికలకు సంబంధించిన తేదీల షెడ్యూల్‌ను ఆ విభాగం కార్యదర్శి కె.కృష్ణంరాజు బుధవారం సాయంత్రం విడుదల చేశారు. క్రీడాకారులు ఆయా తేదీల్లో హాజరు కావాలని, ముందుగా పాఠశాలల నుంచి అనుమతి పత్రాలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

తేదీ	అంశం	విభాగం	ఎంపిక ప్రదేశం
27	క్రికెట్	అండర్-14(బాలురు)	విజ్జీ మైదానం
27	టేబుల్‌టెన్నిస్	14, 17(బాల,బాలికలు)	పువ్వాడ స్కూల్, విజయనగరం
28	క్రికెట్	17(బాల, బాలికలు)	విజ్జీ మైదానం
28	సెపక్‌తక్రా	14, 17(బాల, బాలికలు)	జడ్పీ పాఠశాల వీటీ అగ్రహారం
28	సైక్లింగ్	14, 17(బాలురు)	విజ్జీ మైదానం
28	రగ్బీ	14, 17(బాలురు)	జడ్పీ పాఠశాల, గరుడుబిల్లి
28	బాస్కెట్‌బాల్	14, 17(బాలురు)	జిందాల్ భారతి, కొత్తవలస
28	అథ్లెటిక్స్	17(బాల, బాలికలు)	విజ్జీ మైదానం
30	బేస్‌బాల్	14, 17(బాల, బాలికలు)	జడ్పీ పాఠశాల, బాడంగి
అక్టోబర్			
1న	బాల్ బ్యాడ్మింటన్	14, 17(బాల, బాలికలు)	జడ్పీ పాఠశాల, ఎస్.కోట
1	ఫెన్సింగ్	14, 17(బాల, బాలికలు)	విజ్జీ మైదానం
1	స్విమ్మింగ్	14, 17(బాల, బాలికలు)	ప్రభుత్వ ఈత కొలను

అంతర్రాష్ట్ర నేరస్థుడి అరెస్టు

రాజమహేంద్రవరం నేరవార్తలు: ఒకటి కాదు.. రెండుకాదు.. ఏకంగా 44 కేసుల్లో నిందితుడు.. 14 కేసుల్లో జైలుకు వెళ్లాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జైలు నుంచి విడుదలయ్యాడు. మళ్లీ భారీ చోరీ చేసి ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. ఎస్పీ డి.నరసింహకిశోర్ వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా జగన్నాథపురం ఏటిమొగకి చెందిన పి.రవిశంకర్ అలియాస్ వీరబాబు రాజమహేంద్రవరం ఏవీఏ రోడ్డులోని కోటబాస్కరమ్మనగర్‌లో నివాసముంటున్నాడు. పశ్చిమగోదావరి, విశాఖ, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో నేరాలకు పాల్పడ్డాడు. గత నెల 26 రాత్రి కొవ్వూరు పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంకు వీధిలోని ఓ అపార్టుమెంట్లోకి చొరబడి సుమారు 400 గ్రాముల బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనం ఎత్తుకెళ్లాడు. కేసు నమోదు చేసిన సీఐలు విశ్వం, విజయ్‌బాబు, ఎస్సైలు రవీంద్రబాబు, జగన్మోహనరావు రెండు బృందాలుగా దర్యాప్తు చేపట్టారు. ఆ క్రమంలో ఇటీవల కొవ్వూరు పట్టణంలోని నిడదవోలు బస్టాపులో నిందితుడు, అతడికి సహకరించిన ఎల్.నాగరాజును అరెస్టు చేశారు. చోరీ సొత్తును భీమవరంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ నుంచి రికవరీ చేశారు. 400 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు ద్విచక్రవాహనాన్ని రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

స్థానిక సంస్థల్లో కొలిక్కిరాని బదిలీలు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా కేంద్రంగా జరుగుతున్న బదిలీల ప్రక్రియ స్థానిక సంస్థల్లో ఇంకా కొనసాగుతోంది. సోమవారం నాటికే ఉత్తర్వులు ఇస్తామని ప్రకటించిన అధికారులు బుధవారానికి కూడా అందించకపోవడంతో ఉద్యోగులంతా ఎదురుచూస్తున్నారు. జడ్పీ పరిధిలో సబార్డినేట్లు, జూనియర్ సహాయకులు, టైపిస్ట్ క్యాడర్లకే పత్రాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. సీనియర్ సహాయకులు, సూపరింటెండెంట్లు, ఎంపీడీవో క్యాడర్లలో ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. జడ్పీలో 846 మంది వివిధ కేడర్లలో పనిచేస్తున్నారు. వీరిలో అయిదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారు 235 మంది ఉన్నారు. వీరు కాకుండా రిక్వెస్ట్ అంశం కింద కొందరు దరఖాస్తులు చేశారు. వీరితో పాటు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌లో మినిస్టీరియల్ సిబ్బందికి స్థానచలనం కల్పించాల్సి ఉంది. మరికొన్ని గంట్లోనే ప్రక్రియ పూర్తిచేస్తామని జడ్పీ ఇన్‌ఛార్జి సీఈవో శ్రీధర్ రాజా 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

అక్టోబరు 2 వరకు ఆగాల్సిందే..

సచివాలయ ఉద్యోగులకు సంబంధితశాఖల వారీగా ప్రక్రియ పూర్తి చేశారు. ఉత్తర్వులను మండల కేంద్రాలకు పంపినట్లు అధికారులు పేర్కొంటున్నారు. తొలుత వీరిని ఈనెల 26 వరకూ రిలీవ్ చేయొద్దని ప్రభుత్వం ఆదేశించింది. అక్టోబరు ఒకటో తేదీన పింఛన్ల పంపిణీని దృష్టిలో ఉంచుకుని 2 వరకు రిలీవ్ చేయొద్దని ఆదేశాలు వెలువడినట్లు జిల్లా సచివాలయ అధికారిణి నిర్మలాదేవి తెలిపారు.

కొత్త సూపరింటెండెంట్లు..

నేరవార్తా విభాగం: సెబ్ నుంచి అబ్కారీ శాఖను తప్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నాక ఆయా విభాగాలకు అధికారులను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం సూపరింటెండెంటుగా శ్రీనాథుడు, పార్వతీపురం మన్యం జిల్లాకు జయసింహ చౌదరిని నియమించారు. రెండు జిల్లాలకు సంబంధించి ఎన్‌వీ.రమణకు డిపో మేనేజర్ బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం గుంటూరులో డీసీ(డిప్యూటీ కమిషనర్)గా పనిచేస్తున్న ఎస్‌వీవీఎన్.బాబ్జీరావు బదిలీపై విజయనగరం డీసీగా వస్తున్నారు.

విజయనగరం కంటోన్మెంట్: దేవాదాయశాఖ పార్వతీపురం మన్యం జిల్లా అధికారిణి కె.ఎల్.సుధారాణి అనకాపల్లి జిల్లాకు వెళ్లనున్నారు. అక్కడ పనిచేస్తున్న రాజారావు ఆమె స్థానంలో వస్తున్నారు. విశాఖ జిల్లా సహాయ కమిషనర్‌గా ఉన్న కె.శిరీష విజయనగరం ఏసీగా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఆర్అండ్‌బీ ఈఈ బాధ్యతల స్వీకరణ



విజయనగరం కోట: విజయనగరం డివిజన్ రహదారులు, భవనాల శాఖ ఈఈగా ఎం.జేమ్స్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం డివిజన్ నుంచి వచ్చారు. ఇక్కడ ఈఈగా పనిచేసిన రమణ ఉద్యోగ విరమణ పొందారు.



ఎస్ఈ లక్ష్మణరావుకు సమస్యలు వివరిస్తున్న యూనియన్ నాయకులు

విద్యుత్తు ఉద్యోగుల ఆందోళన


విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: బదిలీల్లో నిబంధనలు పాటించలేదని ఏపీఈపీడీసీఎల్ ఉద్యోగులు మంగళవారం రాత్రి విజయనగరంలోని ఎస్ఈ ఎం.లక్ష్మణరావు కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. సీనియర్లను కాదని జూనియర్లకు స్థానచలనం కల్పించారని ఆరోపించారు. దీంతో చాలా మంది నష్టపోయారని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ(ఏపీ ఈఈ) ఎంప్లాయీస్ యూనియన్-1104 నాయకులు నినాదాలు చేశారు. అవకతవకలను సరిచేస్తామని ఎస్ఈ చెప్పడంతో వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని, ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు యూనియన్ జిల్లా రీజనల్ కార్యదర్శి ఎస్.లక్ష్మణ్ పేర్కొన్నారు.

బాధితులకు రూ.లక్ష విరాళం

సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరానికి చెందిన గూడెంవీధి పెద్ద డి.భానుప్రసాద్, స్థానిక యువత విజయవాడ వరద బాధితులకు అండగా నిలిచారు. వారికి రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. బుధవారం పార్వతీపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విజయచంద్రకు నగదును అందజేశారు.



హోంగార్డుల కుటుంబాలకు అండగా ఉంటాం



చెక్కు అందజేస్తున్న వకుల్ జిందాల్

నేరవార్తావిభాగం: పోలీసు శాఖలో హోంగార్డుగా పనిచేసిన జి.వెంకట సత్యం ఈనెల 10న విద్యుత్తు ప్రమాదంలో మరణించారు. ఈ సందర్భంగా యాక్సిస్ బ్యాంకు శ్యాలరీ ప్యాకేజీ స్కీమ్‌లో భాగంగా మంజూరైన రూ.38 లక్షల చెక్కు, పోలీసు కార్యాలయం తరఫున వెల్ఫేర్, ఎక్స్‌గ్రేషియా, చేయూతగా రూ.4,20,500 చెక్కును బాధిత కుటుంబానికి బుధవారం తన కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోంగార్డుల జీతాలను యాక్సిస్ బ్యాంకులో జమయ్యేలా చూస్తున్నామని, ఎవరైనా మరణిస్తే ప్రత్యేక పథకం కింద నగదు వస్తుందని చెప్పారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, బ్యాంక్ మేనేజర్ విశ్వకల్యాణ్ పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధే లక్ష్యంగా జేజీయూజీఏ


చర్చిస్తున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్, ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ్

పార్వతీపురం, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ అమలు చేయనున్న ప్రధానమంత్రి జన జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ (జేజీయూజీఏ) కింద జిల్లాలో గిరిజన ప్రాంత అవసరాలను గుర్తించి ప్రణాళికలను రూపొందించాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆ శాఖ అదనపు కార్యదర్శి జయ, కలెక్టర్లు, ఐటీడీఏ పీవోలతో దూరదృశ్య శ్రవణ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఐటీడీఏ యంత్రాంగానికి పలు సూచనలు చేశారు. గిరిజనులకు అన్ని విధాలుగా అందుబాటులో ఉన్న ఆసుపత్రి గుర్తించి, అక్కడ అత్యుత్తమ సేవలు అందించేందుకు ఉన్న పరికరాలు, వసతుల వివరాలు తెలియజేయాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. ఈపీఎంకె ప్రక్రియ పూర్తి చేసి, సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీడీ మురళీధర్, డీఎంహెచ్‌వో విజయపార్వతి, గిరిజన సంక్షేమ సాధికారత అధికారి రుక్మాంగదయ్య, పంచాయతీరాజ్ ఇంజినీరింగు అధికారి జి.రవి, ట్రాన్స్‌కో ఇంజినీరింగు అధికారి వేణుగోపాల్, మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారి ఎంఎన్ రాణి, డీఆర్‌డీఏ పీడీ సత్యంనాయుడు పాల్గొన్నారు.

అన్ని ఆధారాలతో అభియోగపత్రం

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: నమోదైన కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టి న్యాయస్థానంలో తగిన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టి నేరస్తులకు శిక్ష పడేలా అన్ని ఆధారాలతో ఛార్జిషీట్ సమర్పించాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. బుధవారం సాయంత్రం మల్టీ పర్పస్ హాల్‌లో పెండింగ్‌లో ఉన్న అన్నిరకాల కేసులపై సమీక్షించారు. స్టేషన్ వారీగా పెండింగ్ కేసులు, ప్రస్తుత పరిస్థితి, నిందితుల వివరాలు, దర్యాప్తు పూర్వాపరాలపై ఆరా తీశారు. నిర్దిష్ట గడువులోగా పెండింగ్ కేసులు పరిష్కారించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి (బ్లాక్ స్పాట్).. వాటి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి కేసుల విషయంలో సుప్రీం కోర్టు తీర్పు, పోలీసుల పాత్ర, తీసుకోవాల్సిన చర్యలు, కేసుల నమోదు తదితర అంశాలను ఏఎస్పీ కేశవరావు, పీపీ జి.వెంకటరావు తెలియజేశారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేశారు. అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్, ఏఎస్పీ అంకిత సురన, పాలకొండ డీఎస్పీ రాంబాబు, ఎస్బీ సీఐ అప్పలనాయుడు, డీసీఆర్‌బీ, సోషల్ మీడియా, సైబర్ సెల్ సీఐ జీడీ బాబు, సీసీఎస్ అప్పారావు, ఏఆర్ ఆర్‌ఐ శ్రీరాములు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో ఎస్పీ మాధవ రెడ్డి, ఏఎస్పీ కేశవరావు, అధికారులు

అసంపూర్తి గృహాల పూర్తికి ప్రణాళికలు


మాట్లాడుతున్న గృహనిర్మాణ సంస్థ జేఈ జానకిరాం

బలిజిపేట, జియ్యమ్మవలస, వీరఘట్టం, పాచిపెంట, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో నిర్మించి వివిధ దశల్లో నిలిచిపోయిన గృహనిర్మాణాలను లబ్ధిదారులు సత్వరమే పూర్తి చేయాలని గృహనిర్మాణ సంస్థ జేఈ సీహెచ్.జానకిరాం కోరారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఆయన గృహనిర్మాణ సంస్థ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగు సహాయకులకు 'మన ఇల్లు, మన గౌరవం' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దారు జి.జనార్దన్, పరిపాలనాధికారి భానుమూర్తి, జేఈ అంబేడ్కర్, ఏపీవో కేశవరావు పాల్గొన్నారు. ● జియ్యమ్మవలసలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగు సహాయకులతో సమావేశమైన గృహనిర్మాణ సంస్థ ఏఈ ఎల్.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఈనెల 28న చేపట్టే మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ● ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో కార్యాలయంలో గృహనిర్మాణ పంచాయతీ ప్రత్యేకాధికారులతో నిర్వహించిన సమావేశంలో వీరఘట్టం ఏఈ వి.వినోద్ అన్నారు. ● పాచిపెంట కాలనీలో మంజూరైన ఇళ్లు వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మండల ప్రత్యేక అధికారి శివప్రసాద్ ఆదేశించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? అప్పయ్యపేట బీసీ కాలనీలో రహదారులకు ఇరువైపులా పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. - అప్పలనాయుడు

● పరిశీలించి మొక్కలు తొలగిస్తాం. - రమేష్, ఈవో, పెదభోగిల - న్యూస్‌టుడే, సీతానగరం

? నర్సిపురం బీసీ కాలనీలో డిపెప్ పాఠశాలకు ప్రహరీ గేటు లేక జంతువులు ప్రాంగణంలో తిరుగుతున్నాయి. - విద్యార్థుల తల్లిదండ్రులు, నర్సిపురం

● పరిస్థితిని పరిశీలించి గోడ పూర్తికి నిధుల కేటాయింపు పనులు చేపడతాం. - విమలకుమారి, ఎంఈవో - న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

త్వరలో మరమ్మతులు పూర్తి

ఈనాడు కథనానికి స్పందన

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేటలోని ఎన్టీఆర్ సాహస ఉద్యానవనంలో యంత్రాల మరమ్మతుల ప్రక్రియ ప్రారంభమయింది. 'ఎన్టీఆర్ ఉద్యానవనం.. బోసిపోయే..' శీర్షికన ఈనాడులో సోమవారం వచ్చిన కథనానికి పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి స్పందించారు. పార్కులో 11 రకాల విహార్‌లు, 20 వివిధ అడ్వెంచర్ల క్రీడలు ఉన్నాయన్నారు. కొద్ది రోజుల్లో వీటికి మరమ్మత్తు ప్రక్రియ పూర్తి చేయిస్తామన్నారు.

అలంకారంగా జనరేటర్లు.. వినియోగించక శిథిలం!

రూ.లక్షల ప్రజాధనంతో కొనుగోలు చేసిన యంత్రాలు నిరుపయోగం



ఎంపీడీవో కార్యాలయంలో వృథాగా ఉన్న యంత్రం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే

మండల కార్యాలయాలకు రూ.లక్షలు వెచ్చించి మంజూరు చేసిన జనరేటర్లు వినియోగించకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. విద్యుత్తు అంతరాయాల్లో ఉపయుక్తమైన ఈ యంత్రాలు వాడకపోవడంతో ఎండకు ఎండుతూ, వానలో తడుస్తూ శిథిలావస్థకు చేరుతున్నాయి. పార్వతీపురం మండల పరిషత్తు ఉపాధి కార్యాలయానికి జనరేటర్లు మంజూరయ్యాయి. మండల పరిషత్తు ప్రాంగణంలో ఎంపీపీ, ఎంపీడీవో, డీఎల్‌డీవో, ఉపాధి హామీ, వెలుగు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, పాలక సమావేశ భవనం కార్యాలయాలున్నాయి. ఉపాధి హామీ పథకంలో 10కేవీ ఆటోమేటిక్ జనరేటర్ మంజూరైంది. దీన్ని వినియోగిస్తే పై కార్యాలయాలన్నింటికీ సరిపోతుంది. ఆరేళ్ల క్రితం వచ్చిన జనరేటర్‌ను వెలుగు కార్యాలయం పక్కన అరుగుపై ఉంచేశారు. ఎప్పుడో ఎన్నికల సమయాల్లో వినియోగించారు. తరువాత డీజిల్ అందించే నాథుడు లేక వదిలేశారు. జనరేటర్ అందరికీ కావాలి, నడిపేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. రంగులు వెలిసి ఒక్కో భాగం తుప్పు పట్టి పాడవుతోంది. విషయం ఉపాధి హామీ ఏపీవో కృష్ణారావు వద్ద ప్రస్తావిస్తే తమ వద్ద నడిపేందుకు నిధులు లేవని, ఉన్నతాధికారులకు విషయం తెలిపామన్నారు.


తహసీల్దారు కార్యాలయం ఆవరణంలో..

పుష్కర కాలంగా అక్కడే..

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనరేటర్ వినియోగించకపోవడంతో పాడైంది. జిల్లాలోని తహసీల్దారు కార్యాలయాలకు 2012లో ఈ జనరేటర్లు మంజూరు చేశారు. దీని నిర్వహణ బాధ్యతలను ఓ ప్రైవేటు కంపెనీకి అప్పగించారు. వారు జనరేటర్లు బిగించిన తర్వాత కనిపించడం మానేశారు. పలువురు అధికారులు ఫోన్లు చేసినా ఫలితం లేకపోతోంది. విద్యుత్తు ఆగిన సమయంలో కంప్యూటర్ల కోసం ఏర్పాటు చేసిన ఇన్వర్టర్లు మినహా ప్రత్యామ్నాయాలు లేవు. విషయం ఉప తహసీల్దారు రమణ వద్ద ప్రస్తావిస్తే.. జనరేటర్ గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

పేదల సంక్షేమం కూటమితోనే సాధ్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: పేదల సంక్షేమం, అభివృద్ధి కూటమితోనే సాధ్యమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం కురుపాం మండలం గుజ్జువాయిలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి కరప్రతులు అందజేస్తూ కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో అమలు చేసిన హామీలు ప్రజలకు వివరించారు. మండల సమాఖ్య ద్వారా గిరిజన రైతులకు స్ప్రేయర్లు, టార్పాలిన్లు అందజేశారు. నాయకులు నందివాడ కృష్ణబాబు, కొండయ్య, సర్పంచి హిమరిక నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు. ● మండలంలోని గుజ్జువాయిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ● స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం సాయంత్రం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఛైర్‌పర్సన్‌గా ఎమ్మెల్యే జగదీశ్వరి, సభ్యులుగా ఆకుల రమేష్, బోటు గౌరీశంకరరావు, మీసాల భారతిలను ఎన్నుకున్నారు. ఆసుపత్రిలోని సమస్యలను కమిటీ ముందు ఉంచి, పరిష్కరించేందుకు తీర్మానించారు. సీహెచ్‌సీ పర్యవేక్షకురాలు డా.శోభారాణి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ● కురుపాం ఉన్నత పాఠశాలలో ఆర్‌ఎంఎస్ నిధులను కేటాయించి నిర్మాణ దశలో ఆగిపోయిన అదనపు తరగతి భవనాలను ఎమ్మెల్యే జగదీశ్వరి ఆకస్మికంగా సందర్శించారు.

రాష్ట్రాభివృద్ధే లక్ష్యం: విజయచంద్ర


స్టిక్కర్ అంటించి వివరిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పేదలకు సంక్షేమ పథకాలు అందించడం, మరోవైపు రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. బుధవారం పట్టణంలోని 16వ వార్డులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించారు. 100 రోజుల పాలనలో సాధించిన ప్రగతిని తెలియజేశారు. నాయకులు వెంకటనాయుడు, సీతారాం, భద్రినారాయణ, వెంకటేష్, వార్డు ప్రజాప్రతినిధులు, జనసేన, భాజపా నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రపై ఆలోచనలు పంచుకోండి

పార్వతీపురం: స్వర్ణాంధ్రజీ 2047 దార్శనిక ప్రణాళిక రూపొందించే ప్రయత్నంలో ప్రభుత్వంలో ప్రజలు తమ ఆలోచనలు పంచుకొని, పత్రం రూపకల్పనలో భాగస్వాములు కావాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం జిల్లా, మండల స్థాయి అధికార యంత్రాంగంలో ఆయన దూరదృశ్య శ్రవణ సమావేశాన్ని నిర్వహించారు. క్యూఆర్ కోడ్‌పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో సభను నిర్వహించి, దార్శనిక ప్రణాళికలోని అంశాలను చదివి వినిపించాలని అన్నారు. అక్టోబరు 1నే వంద శాతం పింఛన్లు పంపిణీ చేయడానికి అవసరమైన ఏర్పాటుచేయాలని ఆదేశించారు. డ్వామా పీడీ రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ సత్యంనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు, పుర కమిషనర్లు, ఎంపీడీవోలు, పశు సంవర్ధక శాఖాధికారి మన్మథరావు పాల్గొన్నారు.

ఆమె చూపు సజీవం


అప్పలనరసమ్మ

పార్వతీపురం పట్టణం, సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరం మండలం అంకలాంలో అనారోగ్యంతో బుధవారం తుది శ్వాస విడిచిన వి.అప్పలనరసమ్మ(82) నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. వైద్యనిపుణురాలు శ్యామల సమాచారం ఇవ్వగా.. ఆసుపత్రి ఆర్‌ఎంవో జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి నేగేష్‌రెడ్డికి తెలియజేశారు. విజయనగరం రెడ్‌క్రాస్ సంస్థ నేత్ర నిధిని సంప్రదించి నేత్రాల సేకరణకు ఏర్పాట్లు చేపట్టారు. ఆమె రెండు కళ్లకు సంబంధించిన కార్నియాలు సేకరించి విజయనగరం తరలించారు. నేత్రదానానికి ముందుకొచ్చిన కుటుంబీకులను అధికారులు అభినందించారు.

జాతీయ స్థాయిలో రాణించాలి


విజేతలకు పౌష్టికాహారం పొట్లాలు అందిస్తున్న అధికారులు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు గుర్తింపు తేవాలని ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ ప్రోగ్రాం అధికారి జి.ఆదిలింగం కోరారు. రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన నరేష్, రమేష్‌లను ఆయన బుధవారం అభినందించి సొంత నిధులతో న్యూట్రిషియన్ ఫుడ్ కిట్లను అందజేశారు. ఇటీవల విజయవాడలో జరిగిన పోటీలో సత్తాచాటి నవంబరు 10న గోవాలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. విజేతలను అధికారులు అభినందించి పోషకాహార కిట్లు అందించారు.

ఒడిశా లారీ అసోసియేషన్ శ్రమదానం

కొమరాడ, న్యూస్‌టుడే: పార్వతీపురం నుంచి కూనేరు వెళ్లే ప్రధాన రహదారిలోని గోతులను ఒడిశా లారీ అసోసియేషన్ శ్రమదానంతో బుధవారం కొంత మేరకు పూడ్చింది. ఒడిశాకు వెళ్లే వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారని గమనించి కొమరాడ వద్ద పడిన గోతులను సంఘ సభ్యులు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యంలో జేసీబీతో తాత్కాలిక పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో రహదారుల మరమ్మతులకు రూ.11 కోట్లు మంజూరైనట్లు ప్రకటనలు చేస్తున్నా.. పనుల్లో కదలిక లేదని ఆరోపించారు.


గోతులు పూడ్చుతున్న ఒడిశా లారీ అసోసియేషన్, సీపీఎం నాయకులు

విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య


మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి మంజులవీణ

పాలకొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు క్రమశిక్షణతోకూడిన విద్యను అందిస్తున్నామని ఆశాఖ అధికారి మంజులావీణ పేర్కొన్నారు. పాలకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు వచ్చే బాధ్యత తల్లిదండ్రులు తీసుకుంటే, ఉత్తీర్ణులు చేసే బాధ్యత తమదని ప్రిన్సిపల్ హరగోపాల్ తెలిపారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండేలా చూడాలన్నారు.

కొట్టుకుపోయిన మినీ వంతెన

● స్తంభించిన పది గ్రామాల రాకపోకలు

బలిజిపేట, న్యూస్‌టుడే: బలిజిపేట మండలంలోని వంతరాం-చినవంతరాం, తెర్లాం మండలం కుసుమూరు మార్గంలో గతంలో నిర్మించిన మినీ వంతెన ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్ద గండి పడింది. ఈ ప్రాంతంలో ఎక్కువగా వర్షాలు కురవకపోయినా ఇతర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వచ్చిన వరదతో ఇక్కడ వంతెన వేగావతి నదిలోకి కొట్టుకుపోయింది. పది గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. స్తంభాలు వేయకుండా ఈ వంతెన నిర్మించడం వల్ల గడచిన రెండేళ్లుగా మూడుసార్లు వర్షపు నీటి ధాటికి వేగావతి నదిలోకి కొట్టుకుపోయింది. వంతరాం, చిన వంతరాం మీదుగా కుసుమూరు వయా బొబ్బిలి వెళ్లాల్సిన పది గ్రామాల ప్రజలు తెర్లాం మీదుగా వెళ్లాల్సి వస్తోందని ఈ గ్రామాల ప్రజలు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఈ వంతెన పార్వతీపురం, బొబ్బిలి నియోజకవర్గాలకు సంబంధించి ఉన్నందున ఇక్కడి ప్రజల రాకపోకల పునరుద్ధరణకు రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఇక్కడ స్తంభాలతో కూడిన మినీ వంతెనను నిర్మించాలని కోరుతున్నారు.

వంతరాం-కుసుమూరు మార్గంలో దెబ్బతిన్న వారధి



కోటదుర్గమ్మ ఆలయ ఈవోగా సూర్యనారాయణ


బాధ్యతలు స్వీకరిస్తున్న సూర్యనారాయణ

పాలకొండ, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా వీవీ సూర్యనారాయణను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన బీవీఎస్ఎస్ మురళీకృష్ణను అనకాపల్లి జిల్లాకు బదిలీ చేశారు. అందరి సహకారంతో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు.

పార్వతీపురం ర.భ.శాఖ ఈఈగా సుబ్బారావు

పార్వతీపురం, న్యూస్‌టుడే : పార్వతీపురం రహదారులు, భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు ఎం.జేమ్స్ విజయనగరం డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీరుగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. సాలూరు డీఈఈ సుబ్బారావుకు ఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఎంపీడీవోగా ఈవోపీఆర్డీకి బాధ్యతలు

పార్వతీపురం గ్రామీణం, జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: పార్వతీపురం ఎంపీడీవోగా ఏవో జీవీఆర్ మూర్తికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన అకీబ్ జావెద్ బదిలీపై ప్రకాశం జిల్లాకు వెళ్లారు. కొత్తగా ఎవరినీ నియమించకపోవడంతో ఈ బాధ్యతలు ఈవోపీఆర్డీకి అప్పగించారు. ★ జియ్యమ్మవలస ఎంపీడీవోగా పనిచేసిన పి.శ్రీనివాసరావుకు శ్రీకాకుళం జిల్లా ఎల్ఎన్‌పేటకు బదిలీ కావడంతో ఆయన రిలీవయ్యారు. ప్రస్తుతం కార్యాలయ ఏవో కె.రామారావు ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు.

డీకే పట్నంలో వైద్య శిబిరం

పార్వతీపురం పురపాలక: పట్టణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 27న మండలంలోని డి.కె.పట్నంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు బి.ఎన్.బి.రావు తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్, శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రి శిబిరానికి సహకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

చెస్ పోటీలకు ఏకలవ్య విద్యార్థులు

భామిని: రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు భామిని ఏకలవ్య పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ గంగాదేవి తెలిపారు. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర పోటీల్లో ఎంపికయ్యారని తెలిపారు.

అల్లర్లు జరగకుండా చర్యలు

సాలూరు గ్రామీణం: వినాయక చవితి ఉత్సవాల్లో ఇటీవల జరిగిన గొడవల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. గొడవలు జరిగిన వడ్డివీధి వినాయక మండపం వద్ద 13 మంది పోలీసులు పహారా కాస్తున్నట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు.

సంపద సృష్టికి కార్యాచరణ ప్రారంభం

వీరఘట్టం: వ్యర్థాల నుంచి సంపద సృష్టించేందుకు వీలుగా బిటివాడలో బుధవారం కార్యాచరణ ప్రారంభించారు. కార్యదర్శి కరణం మురళీ, సంక్షేమ సహాయకురాలు వనజ ఆధ్వర్యంలో పశువుల పేడ సేకరించి నిల్వ చేశారు.

ఆర్థిక అక్షరాస్యత మెరుగుకు కృషి

వీరఘట్టం: రాష్ట్రంలో ఆర్థిక అక్షరాస్యతను మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెదేపా నాయకులు పి.కృష్ణమూర్తి నాయుడు, ఉదయ భాస్కర్ అన్నారు. పనస నందివాడలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

విత్తనాల అందజేత

జియ్యమ్మవలస: బడి తోటలు పెంపకం చేపట్టాలని ఎంఈవో ఎం.శ్రీనివాసరావు కోరారు. బుధవారం మండలంలోని అన్ని పాఠశాలలకు విత్తనాలు అందించారు. ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్-6 పథకాలు అమలుకు డిమాండ్

కలెక్టరేట్ ప్రాంగణం: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా హామీలు నెరవేర్చడం లేదని కాంగ్రెస్ జిల్లా ఇన్‌ఛార్జి బత్తిన మోహనరావు అన్నారు. బుధవారం ఖాళీ పల్లెలతో ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లి డీఆర్‌వో కేశవనాయుడుకు వినతిపత్రాన్ని అందించారు.

ప్రధానోపాధ్యాయుడికి సత్కారం

జియ్యమ్మవలస: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న వనజ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం అల్లు రవిప్రసాద్‌కు పాఠశాల సముదాయ సిబ్బంది సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు విచ్చేసి.. శాలువా కప్పి సత్కరించారు.

పలువురు కార్యదర్శుల బదిలీ

జియ్యమ్మవలస: మండలంలోని అలమండ, శిఖబడి, చినమేరంగి, పరజపాడు పంచాయతీల కార్యదర్శులకు బదిలీ అయినట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో కె.రామారావు తెలిపారు. వేరే మండలాల నుంచి ఐదుగురు రానున్నట్లు చెప్పారు.

ప్రజల అభీష్టం మేరకే ప్రభుత్వ పాలన


పాల్గొన్న తెదేపా ఇన్‌ఛార్జి పడాల భూదేవి

భామిని, న్యూస్‌టుడే: ప్రజల అభీష్టం మేరకే కూటమి ప్రభుత్వ పాలన జరుగుతుందని తెదేపా ఇన్‌ఛార్జి పడాల భూదేవి అన్నారు. బుధవారం తాలాడ, అత్తికొత్తూరు, లోహరిజోల గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, అనేక సంస్కరణలు చేపట్టి 'ఇది మంచి మనసున్న ప్రభుత్వం' అని ప్రజల చేత మెప్పు పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు ఎస్.ఎస్ ప్రకాశరావు, వై.శ్రీనివాసరావు, ఎన్.సోమేశ్వరరావు, పత్తిక గోపాలకృష్ణ, పత్తిక చంద్రరావుతో పాటు తెదేపా నాయకులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు. ● వ్యవసాయంలో సాంకేతిక పద్ధతులు అందిపుచ్చుకొని పంటలు సాగుచేపడితే అధిక దిగుబడులు సాధించొచ్చని పాలకొండ తెదేపా ఇన్‌ఛార్జి పడాల భూదేవి అన్నారు. బుధవారం పసుకిడిలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

తెగుళ్లు, దోమల నియంత్రణ తప్పనిసరి


తెగుళ్లను పరిశీలిస్తున్న ఏవో శ్రావణ్‌కుమార్

బలిజిపేట, న్యూస్‌టుడే: వరి పంటలో పొడ తెగులు, సుడి దోమల నియంత్రణపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి ఎం.శ్రావణ్‌కుమార్ రైతులను కోరారు. తుమరాడలో బుధవారం వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల పంట పొలాలకు వెళ్లి వరి పంటకు సోకిన తెగుళ్లు, దోమల వల్ల పంటకు కలిగే నష్టం గురించి ఆయన వరి ఆకులను పరిశీలించి సూచనలిచ్చారు. తెగుళ్ల నివారణకు రైతులు ఎకరాకు 20-30 కేజీల పొటాష్ వేయాలని, నాణ్యమైన దిగుబడి గింజ బరువు వస్తుందన్నారు. పశు సంవర్ధక శాఖ, వ్యవసాయశాఖ సహాయకులు, ఉపసర్పంచి మూడడ్ల శివున్నాయుడు, మరడ రాజు పాల్గొన్నారు.

పట్టణ ప్రజల దాహార్తి తీర్చండి



ప్రసంగిస్తున్న శ్రామిక మహిళా సంఘ నాయకురాలు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: పార్వతీపురం పట్టణానికి తాగునీరు సమస్య వెంటాడుతోందని, ప్రజలకు మంచి నీరవ్వని పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఉన్నాయని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, ఉపాధ్యక్షురాలు ఇందిర అన్నారు. బుధవారం పట్టణ తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జిల్లాగా ఏర్పడి మూడేళ్లు గడిచినా తాగునీరు ఇవ్వలేకపోవడం శోచనీయమన్నారు. పట్టణానికి సమీపంలో జంఝావతి, నాగావళి నదులున్నా నీటిని తెచ్చే ఆలోచన అధికార యంత్రాంగంలో లేదని విమర్శించారు. 28 వరకు కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు చేపట్టి.. అక్టోబరు 1న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని పిలుపునిచ్చారు. సిటు నాయకులు మన్మథరావు, జి.వెంకటరమణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి జనసేన ధార్మిక యాత్రలు


వేంకటేశ్వరాలయంలో జనసైనికుల పూజలు

పార్వతీపురం, పార్వతీపురం పట్టణం, సీతానగరం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ప్రసాద లడ్డూ విషయంలో జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తంగా ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేస్తున్న విషయం విదితమే. దీనికి సంఘీభావంగా జనసేన ఈనెల 30 నుంచి అక్టోబరు 3 వరకు నాలుగు రోజులపాటు ధార్మిక యాత్రలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈనెల 30 దీపారాధన, అక్టోబరు 1న ఓం నమో నారాయణాయ మంత్ర పఠనం, 2న నగర సంకీర్తన, 3న ఆలయాల్లో భజనలు చేపడతారు. జనసేన నాయకులు రాష్ట్రవ్యాప్తంగా అమలుకు నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా బుధవారం పార్వతీపురంలో నియోజకవర్గ సమన్వయకర్త ఎ.మోహనరావు ఆధ్వర్యంలో జనసేన శ్రేణులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.